# కాత్యా చెప్పిన కథ

ఇది కథ కాదు.

నాకు కథలు రాయడం వచ్చునని గాని, కనీసం మనసును ఆకట్టుకునేలా కథ చెప్పగలనని గాని ఎన్నడూ అనుకోలేదు.

కాని—

నిన్నా. ఇవ్వాళా నా మనసులో చెలరేగుతున్న కల్లోలా నలుగురితో పంచుకోకుండా, నేనొక్కదాన్ని ఒడగట్టుకోవడం సాధ్యం కాని పనిలా కనపడుతోంది. కనుక— ఇది ఒక రకంగా లోపల ఇముడ్చుకోలేక బయటికి వెళ్ళగక్కిన కథ— అని చెప్పొచ్చు. ఇది ఇలా జరగక తప్పలేదు.

ఇరవయ్యేళ్ళ వయసున్న కాత్యాయనికి కొంత నాటకానుభవం ఉంది. ఆటలలో కొద్దిపాటి నైపుణ్యం ఉంది. చలాకీతనం ఉంది. అన్నిట్నీ మించి కళ్ళు మిరుమిట్లు గొలిపే అందం ఉంది. ముఖంమీదకి ఫ్లడ్‌లైట్ వేస్తే— ఆ వెలుగుకి పరిసరాలు సరిగ్గా కనపడనట్టు, ఆమె ఎదురుగా ఉంటే ఆ జగన్మోహక సౌందర్య జ్వాలాహేల ముందు ఇతర పరిసరాలు మనకు కనపడవు. లోపలా, బయటా అంతటా ఆమె అందమే చూపరులను ఆక్రమిస్తుంది. మరో యోచనకు మనల్ని అంధుల్ని చేస్తుంది. మనసునిండా ఆమె అందం— తాజాతనం— ఆరోగ్యంతో మిసమిసలాడే ఆమె సౌష్టవమైన శరీరం— ఇవే నిండిపోతాయి. ఆడదాన్ని నా కళ్ళే చెదిరిపోయాయంటే— మొగవాళ్ళు, ఆమెను తొలిసారి చూసిన వాళ్ళు, ఎంత సౌందర్య వాంఛతో తిమ్మిరెక్కిపోయే వారో ఊహించుకుంటే పాపం అని జాలి వేస్తుంది. మధురవాణి చెప్పినట్టు ఆడది మెచ్చిందే అందం. మగవాడి కన్ను మెల్ల కాత్యాయినిని మొదటిసారి రామశెట్టిగారి కొత్త సినిమా సెట్స్‌మీద కలిసినప్పుడు ఆ మాటే చెప్పాను. నవ్వింది, మధుర మధుర మధురంగా! ఎట్లా ఎర్ణించను ఆ నవ్వును మర్త్యమైన ఈ మానవ భాషలో?

కాత్యాయినిని రామశెట్టిగారే నెల్లూరు నాటకాల పోటీలో కనిపెట్టారు. ఆయనొక జడ్జీ. ఆ పోటీలకి. నెల్లూరు నెరజాణ అనుకున్నారట మొదట. తరువాతతెలిసిందట. విజయనగరం వజ్రం అని. ఆ మాటకొస్తే మాదీ విజీనారమే. నేనూ విజీనారం వెండి తీగనే. (మా కాత్యాయిని బంగారు తీగ— కాదు మెరుపు తీగ)

కాత్యాయిని సినీమాల్లో ప్రవేశించేనాటికి నేను కనీసం ఒక పది సినీమాల్లో నానా వేషాలూ వేసి ఉంటాను. నాకు మొదటిసారి హీరోయిన్ ఛాన్స్ వచ్చినప్పుడే. కాత్యాయిని. నేరుగా మొదటి సినిమాలోనే హీరోయిన్ అయ్యి కూర్చుంది. చెప్పొద్దూ— నాకు కొద్దిగా అసూయ కలగకపోలేదు.

ఇద్దరి సినీమాలూ ఒకవారం తేడాలో ఒకేసారి విడుదలయ్యాయి. నటిగా నా సర్వశక్తులూ ఉపయోగించి నటించాను. కథలో కూడా కొంత కొత్తదనం ఉన్నది. రచయిత మా విజయనగరం వాడే. ప్రొడ్యూసరూ. డైరెక్టరూ, హీరో—ముగ్గురూ కలిసి కూచుని ఆ కథనికాస్తా కైమా చేసేశారు. ఫోటో గ్రాఫర్, మేకప్‌మన్, ప్లేబాక్ సింగర్, ఎడిటర్, డాన్స్ డైరెక్టరూ, పబ్లిసిటీ ఆర్టిస్టూ.... ప్రతీ వాళ్ళూ రచయితకు సలహాలు చెప్పేవాళ్ళే. కథను మార్చమనే వాళ్ళే. చివరికి—నేను మొదట విన్న కథకీ, సినిమా కథకీ ఏకోశానా పోలిక లేకుండా తయారయింది. ఒక దశలో రచయిత విసిగిపోయి. "మీ సినిమాకోదణ్ణం, నా కథ మాత్రం ఇవ్వలేను. నాకు డబ్బు అక్కర్లేదు. నావు సెలవిప్పించండి" అనే స్థాయి వచ్చింది. కథ—అంతవరకూ వచ్చాక ప్రొడ్యూసర్ కొంతవరకూ "సరి పెట్టుకుని" కథలో అట్టే మార్పులు లేకుండానే

సెల్యులాయిడ్‌కి ఎక్కించడానికి అంగీకరించాడు. మొదటిసారి సినీమా ఫీల్డులో రచయిత స్థానం ఎటువంటిదో చూశాక నాకు చాలా జాలి కలిగింది. వ్యక్తిత్వం కావాలనుకునే నాడెవడూ సినిమా రచయిత కాకపోవడానికి గల కారణం బోధపడింది.

నా సినీమాకి కలక్షన్లు అంతగా బాగులేదు. గొప్ప ప్రయోగాత్మకచిత్రం అని పేరు మాత్రం అన్ని వర్గాల్లోంచీ వినపడింది. కలక్షన్లే కొలబద్దలుగా భావించేవాళ్ళ కళ్ళకు ప్రశంసలు పనిచెయ్యవు కదా!

కాత్యాయిని నటించిన సినీమాకు యమకలక్షన్లు వస్తున్నాయి. కాత్యాయిని అందం గురించి ఎవ్వరూ ఆలోచించలేదు. ఆమె అందం ఆమె నటననుమింగేసింది ఆకర్షణముందు ప్రతిభ తలవంచుకోవలసిన పరిస్థితులు దాపురించాయి.

నా సినీమా క్రమంగా విజయనగరం, విజయవాడ, సికింద్రాబాద్‌లలో బలవంతంగా శతదినోత్సవం వరకూ ఈడ్చారు. రాష్ట్రపతి ప్రశంసా పత్రం కూడా లభించింది. నాకు మరికొన్ని చిత్రాల్లో హీరోయిన్ పాత్రలు వచ్చాయి. ఎంత క్లిష్టమైన పాత్రనైనా అవలీలగా నటించగలనన్న పేరు సంపాదించుకోగలిగాను. ప్రతిభకు గుర్తింపు రావడం నాకెంతో సంతోషాన్నిచ్చింది.

రాష్ట్రపతి ప్రశంసా పత్రం వంకన మా ప్రొడ్యూసర్ తోపాటు ఢిల్లీ వెళ్ళివచ్చాను. కలలో కూడా కలుసుకుంటానని ఊహించి ఉండని ప్రముఖుల్ని కొందర్ని కళ్ళారా చూశాను. కొందర్ని కలుసుకుని మాట్లాడగలిగాను. కరచాలనం చెయ్యగలిగాను. కొందరితో ఫోటోలు తీయించుకున్నాను. చెరువులో ఈదులాడే చేప సముద్రంలో పడినట్టు సంతోషంతో ఉక్కిరిబిక్కిరయిపోయాను.

సినీమారంగం అంతా ఆమెని కాత్యాయిని అని పిలిచేది. నేరు ముద్దుగా కాత్యా అనేదాన్ని నన్ను ప్రేమగా అక్కా అని పిలవమన్నాను. అలాగే పిలిచేది.

కాత్యా సినీమాలు పరుగులు తీస్తున్నాయి. డబ్బు నురుగలు కక్కుతోంది. పాపులారిటీ పరవళ్ళు తొక్కుతోంది. ఫాన్లు పడి చచ్చిపోతున్నారు. ఆమె కొరికి వదిలిన యాపిల్ ముక్క పన్నెండు వేలు పలికింది! క్రేజ్ క్రేజ్! కాత్యా క్రేజ్!! సుడిగుండంలా దేశాన్ని చుట్టేస్తోంది.

ముత్యం మూడేళ్ళు తిరక్కుండా త్యాగరాయనగర్‌లో పెద్ద బంగళా కొన్నది. రెండు కార్లున్నాయి. నేను సినీమారంగంలో ప్రవేశించి ఏడెనిమిదేళ్ళయింది. తగుమాత్రపు డాబా ఇల్లుంది. కారు కొనాలా వద్దా అని తటపటాయిస్తున్నాను. నేను గ్లామర్ స్టార్‌ని కాదు. నా కంటె కాత్యా రేటు మూడురెట్లు. ఇంకా పెరుగుతోంది కూడానూ. నేను కేవలం కేరక్టర్ ఏక్టర్ స్థాయిలోనే ఉన్నాను. నేనింతవరకూ కేవలం నలభయ్యారు సినీమాల్లో నటించగా– కాత్యా అర్ధ చిత్రోత్సవం దాటేసింది!

విపరీతమైన గ్లామర్– నటుల్ని చంపేస్తుంది.

ఎర్లీ సక్సెస్. తొలి చిత్రంలోనే ఘనవిజయం– అదికూడా నటుల్ని ముందుకు నడవనివ్వదు.

నిదానం మీద వచ్చే విజయానికి పునాది దిట్టంగా ఉంటుంది.

ఆ మాటే ఓసారి కాత్యాతో అన్నాను. అది చాలా మెతక మనిషి ఎప్పుడూ, ఎవర్నీ ఏ విషయంలోనూ కాదనలేదు. నువ్వు కొందరితో నిర్మొగమాటంగా ఉండాలి సుమా అని చెప్పాను. కొన్ని కొన్ని విషయాల్లో కఠినంగా ఉండకపోతే నీ భవిష్యత్తు దెబ్బతింటుంది సుమా అని కూడా హెచ్చరించాను.

కాత్యా అమాయికురాలు. బోళామనిషి. అల్పసంతోషి. సరిగ్గా చెప్పాలంటే– తొందరపడి. వసంతంవచ్చేసిందని, ముందే కూసి మోసపోయినకోయిల కాత్యా! అందుకే నాకీ బాధ!

నా మాట ఏమాత్రం లక్ష్యపెట్టినందుకు నాకు కోపం వచ్చింది. సుడిగాలిలో ఊగిపోతున్న పువ్వు. నేను సంతోషంతో ఊగిపోతున్నానుకుంటే– ఎవరుమాత్రం ఏం చెయ్యగలరు?

నిర్మాతలకూ, దర్శకులకూ డబ్బు పిచ్చీ, కీర్తి పిచ్చీ తప్ప మరోటి ఉండదు. ఆ పిచ్చిలో వాళ్లు నటుల్నీ, రచయితల్నీ, కళాకారుల్నీ బలి తీసుకుంటారు. ఏకచ్ఛత్రాధిపతులుగా ప్రవర్తిస్తారు. ప్రేక్షకుల అభిరుచుల ప్రకారం సినిమాలు తీస్తున్నాం అంటారు. తాము తీస్తున్న చిత్రాలు కళాఖండాలని మనల్ని నమ్మమంటారు. డబ్బు విరజిమ్మి. రాజకీయం ఉపయోగించి. అవసరమైన అందమైన కొత్త హీరోయిన్లని ఉపయోగించి ఎవార్డులు తెచ్చుకుంటారు. నాకు తెలిసిన ఒక నటుడూ, మరొక రచయితా- డబ్బు పిచ్చిలో, కీర్తి పిచ్చిలోపడి సర్వనాశనం అయ్యారు. దర్శకనిర్మాతలు గ్లిసరిన్ కన్నీళ్లు కార్చారు.

నిర్మాతల్నీ దర్శకుల్నీ అడించగల హీరో ఉండేవాడు. ఆయనిప్పుడు కేంద్రంలో డిప్యూటీ మంత్రి అయ్యాడు. అలాంటి వాళ్లకి అంతా జడుస్తారు. కళారంగంలో కూడా గూండాయిజమే రాజ్యమేలడం ఎంత దురదృష్టకరం!

మర్రిచెట్టులాంటి హీరో రాజకీయ రంగం ప్రవేశం చేసిన తరువాత సినిమా ప్రపంచంలో పెను మార్పులు వచ్చాయి. చిల్లరదేవుళ్లకు కొమ్ములు పెరిగాయి. క్షుద్రమైన కుమ్ములాట ప్రారంభమైపోయింది.

చాలా త్వరలోనే నాకు ప్రపంచం మీద అసహ్యం కలిగింది. పారిపోవడానికి వెంటనే దారి కనపడలేదు.

నేను శ్రీకాకుళం సాయుధ పోరాటం నేపథ్యంలో తయారైన చిత్రంలో నటించాను. ఆ చిత్రంలోనానటన చాలా గొప్పగా ఉందని ప్రముఖులందరూ పొగడడం ప్రారంభించారు. నాకు ఈ సంవత్సరం ఊర్వశి ఎవార్డు తప్పదని "విశ్వసనీయమైన" ఊహాగానాలు సాగాయి. ఈ గాలి కబురుకి కొందరు ప్రాణం పోశారు. దేశంలో చాలా పత్రికలు నా ముఖం ముఖచిత్రంగా వేశాయి. ఆ అవార్డు నిజంగా వస్తే స్వీకరించాలా వద్దా అనేచర్చ ఒక పక్క మా యూనిట్‌లో సాగుతోంది. "బహుమతి బహుమతే సిద్ధాంతం సిద్ధాంతమే" అన్నాడొకాయన. ఆయన శ్రీశ్రీ భక్తుణ్ణని చెప్పుకొంటూ ఉండేవాడు. కాత్యా ఫోన్ చేసి ఆ చిత్రంలో నా నటనకు నన్ను అభినందించింది. నా ప్రతిభను గుర్తించింది. తాను అమెరికా వెళ్లి నటించి వచ్చిన సినిమా వీలయితే చూడమని చెప్పింది. నేను చూడనే లేదు. చూడాలి.

నాకు ఊర్వశి ఎవార్డు రాలేదు.

కాత్యాకు వచ్చింది.

నేను కాత్యాకి ఫోను చేద్దామనుకుంటుండగా ఫోన్ మ్రోగింది.

"శాంతక్కా. నా సినిమా నువ్వు చూడనేలేదు. నువ్వసలు పూర్తిగా చూడవలసిందే. కావాలంటే మీ ప్రొడ్యూసర్‌తో చెప్పి నీ కాల్‌షీట్లు ఎడ్జస్ట్‌చేయిస్తాను. మా శెట్టిగారు నా ఫ్రెండ్స్ కోసం ప్రత్యేకంగా సినిమా వేయిస్తున్నారు. అనంతరం హొటల్ సూపర్ స్టార్‌లో గ్రాండ్ పార్టీ, నా అభినందన సభ–" అన్నది కాత్యాలు అవతలి నుంచి.

మరో పావుగంటలో కారులో అవతరించింది దేవతలా. కాత్యా అమాయికత నాకు ఆశ్చర్యం కలిగించింది. సినిమా ఫీల్డులో మరీ అంత స్వచ్ఛమయిన అమాయకత తగదుగాక తగదు. ఆ చిత్రంలో కాత్యా నటన చూసి దిమ్మెరపోయాను. ఆపుల్లీ గ్రేట్ సుపర్బ్-మార్వలస్ ఒకటి కాదు పది ఊర్వశి ఎవార్డులు ఇచ్చినా తక్కువే. గ్లామర్. టాలెంట్‌ని కమ్ముకురాలేకపోయింది. ప్రతి బిట్టులోనూ టాలంట్ అత్యద్భుత రీతిలో దర్శనం ఇచ్చి నమ్మలేకపోయాను. హాల్లోనే కాత్యాని కావలించుకొని ముద్దు పెట్టుకున్నాను.

అసలు కథంతా ఆ తరువాతే జరిగింది.

సినీ నటుల్లో రాజకీయాలూ. పార్టీలూ, ముఠాలూ ప్రారంభమయ్యాయి. కాత్యావల్ల. సినిమారంగం రెండుగా చీలింది. చాలా ఆశ్చర్యంగా విషాదకరంగా కాత్యాకు తెలుగు బుకింగ్స్ తగ్గాయి. హిందీలో ప్రవేశించి ఆ దెబ్బ కాచుకుంది. ఇది జరగడానికి దాదాపు ఒక ఏడాది పట్టింది గాని నామట్టుకు నాకు కన్ను మూసి తెరిచేలోగా జరిగిపోయినట్టుంది. ఇంకో సంగతి! కాత్యా ఖొరానా అనే హిందీ నటుణ్ణి పెళ్లి చేసుకుంటుందనే వార్త మద్రాసు సినిమా ప్రపంచంలో రంగురంగుల దీపావళిమంటలా వ్యాపించింది. నేను మొదట నమ్మలేదు. నాకు పెళ్లిచేసుకునే ఉద్దేశం ప్రస్తుతం లేదని ఆమధ్య నాతో అన్నది. ఇంతలోనే ఈ కబురు.

ఆ కబురు విన్న వారం పది రోజుల్లోనే బొంబాయిలో కాత్యా పెళ్లి జరిగిపోయింది. ఆ సంగతి నాకు మైసూరులో షూటింగ్‌లో ఉన్నప్పుడు తెలిసింది. కాత్యా నాతో చెప్పకుండా పెళ్లి చేసుకుంది. అంతే. హనీమూన్‌కి స్విట్జర్లండ్ వెళ్లిపోయిందట.

మూడు నెలల తరువాత విడుదలయిన కాత్యా హిందీ సినిమాలు వరుసగా “ఫ్లాప్” అయిపోతున్నాయి. ఆమెలోని గ్లామర్ కూడా క్రమంగా తగ్గుముఖం పట్టినట్టున్నది. నాకు చాలా బాధ కలిగింది.

కాత్యా సినిమా రంగంలో ప్రవేశించి ఆరేళ్లు దాటింది. భూమి నుంచి బయలుదేరి పైకి పైపైకి తారాపథానికి ఎగిరి ఎగిరి చివరికిప్పుడు భూమికి చేరువకు వస్తున్నది. తారాజువ్వలాగ. దాదాపు వంద సినిమాల్లో నటించింది. నిర్మాతలకు కనకవర్షం కురిపించింది. నమ్మిన వాళ్లను ఆనందసముద్రంలో ముంచి తేల్చింది. ఊర్వశి ఎవార్డు అందుకుంది. షూటింగ్ పేర ప్రపంచం అంతా పర్యటించింది. ఎందరి హృదయాల్లోనో తియ్యని కల్లోలం రేపిన కాత్యా జీవితంలోనే ఇవాళ కల్లోలం రేగబోతున్నది.

ఆ సూచనలు నాకు స్పష్టంగా తెలుస్తూనే ఉన్నాయి గాని కేవలం నేను ప్రేక్షకురాలిగా మాత్రం మిగిలిపోక తప్పలేదు.

ఆమె బొంబాయిలో నేను షూటింగుల్లో బిజీగా వున్నం కాలం కొండెక్కినట్టయింది. బరువుగా రొప్పుతూపరుగులు తీసింది. మూడేళ్లలో రెండు “గర్భస్రావాలు” జరిగాయి. భర్త చేతిలో దారుణమైన హింస అనుభవించింది. సెంట్రల్ స్టేషన్‌లో దిగి టాక్సీలో తిన్నగా ఇంటికి వచ్చింది. అప్పటికి నేను ఇంటి దగ్గర లేను. షూటింగ్ ముగించుకుని ఇంటికి వచ్చేసరికి సోఫాలో నిద్ర పోతోంది. ఆశ్చర్యం. ఏదీ ఆ మహా సౌందర్యం? కాత్యా కాత్యా.... ఇలా అయిపోయావేమిటి కాత్యా .....ఏం జరిగింది కాత్యా నీకు?

ఇరవై రెండవ ఏట పదహేడవ పుట్టిన రోజు జరుపుకోవడం నాకు బాగా గుర్తుంది. ఎంత అందం. ఎంత పరువం బిగువు ఏవీ అవన్నీ...! ఏవి తల్లీ ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు? ఏవి తల్లీ నాడు మెరిసిన సొగసు సోయగముల్? తీరు తియ్యములు!? ఏవి కాత్యా ఏవి కాత్యా నాడు పంచిన నవ్వు జల్లులు... సొంపు వంపులు ఏవి కాత్యా ఏవి తల్లీ ....... ఏవి కన్నా .... ఏవి చిన్నా.......

చెబితే మీకు నమ్మకం కలగకపోవచ్చు. జాలితో నాగుండె కరిగి నీరయిపోయింది. నేను తల్లినయినట్టూ కాత్యా నాచిన్నారి బిడ్డ అయినట్టూ ఆమెని పట్టుకుని నీ గుండెలకి హదువుకున్నాను. దాదాపు ఆరేళ్ల క్రితం స్వచ్ఛమయిన తెల్ల కాయితంలా మద్రాసులో ప్రవేశించిన మణిపూస-గాజుపూసగా మట్టిపూసగా మారిపోయిందా? పాడు జీవితము యౌవనం మూడునాళ్లా ముచ్చటేనా? సౌందర్యం బొత్తిగా యింత క్షణికమా?

ఇటీవల ఒక యాభైఎనిమిదేళ్ల పద్మశ్రీ యుతుడైన ఎవర్ గ్రీన్ హీరోతో నాకు తీవ్ర అభిప్రాయ భేదం వచ్చింది. సమస్త అవలక్షణాలూ కలవాళ్లు ఇతర్లపై నిందమోపడానికి ఎందుకు సిగ్గుపడరో-

అదీనిజమే-ఓటికుండలే ఓండ్రపెడతాయి. కీర్తిని కొనుక్కోగలరుగాని సంస్కారాన్ని కొనుక్కోలేరు గదా-

సినిమారంగం మీద గత కొంత కాలంగా చాలా అసంతృప్తిగా ఉన్నమాట నిజమేగాని మరీయింత అసహ్యం, జుగుప్స ఎన్నడూ కలగలేదు- విలను నవ్వులు నవ్వేవాళ్లు హీరోలు గానూ, డైలాగులు కూడా చెప్పలేని వాజమ్మలు మహానటులుగానూ. చాలామణీ అయిపోతున్న ముచ్చి బంగారపు మురికి ప్రపంచంలో ఏదయినా సాధ్యమే. తాగడం, సరదాలు తీర్చుకోవడం అవినీతని నేననుకోను. డబ్బుకోసం ప్రతి చెత్త సినిమాలోనూ. ప్రతి చెత్త వేషమూ నటించడంకూడా అవినీతి కానేకాదు. నటులకు సిద్ధాంతాలూ, నిజాయితీ. చిత్తశుద్ధీ వుండాలను కోవడం పేరాస కావచ్చు. కాని స్నేహాన్ని కుట్రతో వెన్నుపోటు పొడవడం అవినీతే. అవినీతే. అన్నం పెట్టిన చేతిని నమ్మించి నరకడం అవినీతే. అవినీతే. గోరుముద్దలు తినిపిస్తూ గోతిలో తొయ్యడం తప్పక అవినీతే. అన్యాయమే. అక్రమమే. అధర్మమే....

మరందుచేతనే, సహించడం, భరించడం చేతకావడం లేదు. గనుకనే సినిమాల్లో నటించడం మానెయ్యాలనుకుంటున్నాను. ఈ మద్రాసు మాయజలతారు ప్రపంచాన్ని వదిలి విశాఖపట్నం వెళిపోదాం అని కూడా అనుకుంటున్నాను. ఒక నికరమైన. నిజమైన పెళ్లి చేసుకోవాలని కూడా నిర్ణయించుకున్నాను. అదుగో అలాంటి సమయంలో కాత్యా నన్ను వెదుక్కుంటూ వచ్చినా గుండెల్లో తలదాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. అప్పుడు కాత్యా చెప్పిన సంగతులన్నీ చెప్పాలనే ఉందిగాని చెప్పను. ధనమూ. కీర్తీ పురుషాహంకారమూ ఆభిజాత్య గర్వమూ గల మగవాడు ఎంత నీచంగా, కుసంస్కారంతో ప్రవర్తిస్తాడో ఆమె "తాళికట్టిన భర్త" అంత హీనంగానూ ప్రవర్తించాడు. ఆఖరికి సంతానాన్ని కూడా కననిచ్చాడు. కాదు చెరకు గడలోని రసాన్ని చివరంటా పీల్చి, పిప్పిని వూసేసినట్టు. ఆమె అణువణువులోనూ తొణికిసలాడే అందాల్ని అనుభవించి నీరసం చేసి బయిటికి గెంటేశాడు. తల్లి అయ్యే అవకాశాన్ని శాశ్వతంగా దూరంచేసి సంతాన నిరోధక ఆపరేషన్ బలవంతంగా చేయించి వదిలేశాడు. అంటే-ఇకపై-మరొకర్ని పెళ్లాడి సంతానాన్ని పొందే అర్హతకూడా లేకుండా చేసేశాడు. రహస్యంగా దాచుకున్న కొంతడబ్బూ, కొన్ని బంగారపు నగలూ తప్ప-ఆమెకు మరి ఏ ఆధారమూలేదు.

మాజీ మహానటి, మాజీ సౌందర్యరాశి-అనే పేరు ప్రతిష్టలు మాత్రం మిగిలాయి. ఇప్పుడామె వాటిమీదనే జీవించాలి.

నిజంగా అయితే కాత్యా కథ ఇక్కడితో ముగిసిపోతుంది. కాని సరిగ్గా ఇక్కడే కాత్యా అసలు కథ ప్రారంభమయింది. ఇంతాచేస్తే-ఆ కథకు ఇంతవరకూ చెప్పింది ఉపోద్ఘాతమే. ఇప్పుడిక కథ చిన్నదే. కాని మిన్నయైన సత్యాన్ని చెప్పింది నాకు.

కొద్దిరోజులు మా యింట్లో ఉన్న తరువాత-వేరే యిల్లు అద్దెకు తీసుకుంది. సినీ ప్రముఖులందర్నీ పిలిచి బ్రహ్మాండంగా పార్టీ ఇచ్చి తాను సినిమా రంగంలో పునః ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. అందరూ చప్పట్లు కొట్టారు. కొందరే బాధపడ్డారు. వాళ్లే కొంత కాలం ఆదుకున్నారు. కొన్ని కారెక్టర్ రోల్స్ ఆమె చేత చేయించి. కొంత డబ్బు ముట్టచెప్పారు. అతకు అతుకేగాని అసలుకానట్టు ఆమె నటజీవితం అంతంత మాత్రంగానే సాగింది. కీర్తి అన్ని వేళలా డబ్బు తీసుకురాలేదు.

ఉన్నట్టుండి ఆమె ఒక చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నది. ఆ చిత్రంలో ప్రధాన నటిని నేనే. ఒక నిర్మాతతో చిత్రానికి కావలసిన పెట్టుబడి విషయంలో ఒప్పందం కుదుర్చుకుని ఆమె ఆ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నది. అది ఒక సినీనటి యొక్క జీవిత కథ! బహుశా అది ఆమె కథే కొద్ది మార్పులు మినహా!

ఆ చిత్రంలో ఏ విధమైన డబ్బూ తీసుకోకుండా నటిస్తానన్నాను. కాత్యా ఒప్పుకోలేదు. ఈ ప్రయోగంలోకి దిగవద్దని కాత్యాకి చెప్పాను. ఆర్థికంగా ఈ ప్రయోగం ఆమెని దెబ్బతీస్తుందని నాకు బాగా తెలుసును. కాని నామాట వినలేదు. అన్నీ పోగొట్టుకున్నవాడు చిట్టచివరి చిల్లర డబ్బులతో జూదం ఆడతాడు. ఆశ మహ చెడ్డది. కాత్యాకి డబ్బుపై కాపీనం ఉన్నదని కూడా అనుకోను. బహుశా గతించిన గొప్పపేరు, పాపులారిటీ, వైభవం కోసం ఏమో ఈ పరుగు! ఈ చిత్రంలో ఆమె పాత్ర ఆ నటి స్నేహితురాలు!

నేను సినిమాల్లో నటించడం మానెయ్యాలనుకుంటున్న దశలో కాత్యాయిని చిత్రం నన్ను చిత్రరంగానికి బంధించింది. అదే నా చివరి చిత్రం అని నిర్ణయించేసుకున్నాను. ఉన్న డబ్బుతో నా జీవితం సుఖంగా వెళ్ళిపోతుంది. నాకు అపార ధన రాసులు లేకపోవచ్చు గాని జీవితంలో క్రమ శిక్షణ పుష్కలంగానే ఉంది. సినీమారంగంలో క్రమశిక్షణ కొంచెం అరుదైన వస్తువే. కనుక ఎందుకు నాకీ రొంపి?

ఈ సినిమా కథా రచయిత మా విజయనగరం వాడే, లోగడ ఒక కథ రాశాడు. ఇది ఆయన రెండవ సినిమాకథ. ఇతర దర్శకుల వలె కాత్యా ఎక్కడా వ్యాపార సూత్రాలతో రాజీ పడలేదు. కథలోని బిగువు చెడకుండా రూపొందిస్తున్నది. ఆమె ప్రతిభచూస్తే నాకే ఆశ్చర్యం కలిగింది. శత దినోత్సవ, రజతోత్సవ, స్వర్ణోత్సవ దర్శకులు ఆమెను చూసి నేర్చుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. రచయిత గారు చాలా సంతృప్తి పడ్డారు. తన కథకు తాను ఆశించిన సినీమా రూపం వచ్చినందుకు చాలా సంతోషించారు.

చిత్రం పూర్తయింది.

రిలీజు కాలేదు. సెన్సారు చిక్కులు. డిస్ట్రిబ్యూషన్ చిక్కులు శత కోటి సమస్యలు.

నేను విశాఖపట్నం వెళ్ళిపోయాను. ఆ రచయిత గార్ని పెళ్ళి చేసుకున్నాను. అంటే మేం కలిసి కాపురం పెట్టాం. కనీసం దండలైనా మార్చుకోలేదు. ఒకరిపై ఒకరికి పరిపూర్ణ విశ్వాసం, అనురాగం ఉన్నప్పుడు ఇవన్నీ దేనికీ. ఇప్పటికే నేను సినీమా పెళ్ళిళ్ళతో విసిగివేసారి పోయాను. ఆయన కూడా చిన్నప్పుడే అయిన పెళ్ళితో దెబ్బ తినేసి ఏకాకిగా బ్రతుకుతున్నాడు. మా పెళ్ళి నాటికి ఆయన వయసు 40. నా వయస్సు (నిజం వయస్సు) 32. మా పెళ్ళికి కాత్యా రాలేదు. ఏ ప్రముఖులూ రాలేదు. విశాఖపట్నం డాల్ఫిన్స్‌లో ఒక చిన్న పార్టీ ఇచ్చాం. కొద్ది మంది సన్నిహితులకు.

కాత్యా కబుర్లు తెలియవు. చిన్న చిన్న వేషాలు వేస్తున్నట్టుంది. అక్క, వదిన, ఫ్లాష్ బ్యాక్‌రోల్స్, వగైరా ! ఏడాది తరువాత ఏం జరిగిందో తెలియదు. నా చివరి సినీమారిలీజయింది. చాలా స్లోగా లాగుతోంది. ఎలాపోతే నాకేం కావాలీ! ఓ రోజు ఉన్నట్టుండి టాక్సీ ఆగింది మా ఇంటి ముందు. కాత్యా! దాన్ని చూసి సంవత్సరంన్నరో రెండు సంవత్సరాలో అయింది. ఎంత చిక్కిపోయింది. నాకు ఊర్వశి ఎవార్డు రాబోతోందట. ఆ మాట మా ఆయన విని సంతోషించారు.

రెండు రోజులు తరువాత ఆ వార్త టెలిగ్రాం ద్వారా నాకు తెలిసింది. అదే రోజు సాయంత్రం రేడియోలోనూ టీవీలోనూ వెలువడింది. మర్నాటి ఉదయం అన్ని పత్రికల్లోనూ మొదటి పేజీ వార్త.

మొత్తానికి కాత్యా విజయం సాధించింది.

నేనూ, కాత్యా మా వారూ నిర్మాత గారూ ఢిల్లీ వెళ్ళాం. నాకు మళ్ళీ సినీమా ఆఫర్లు కొల్లలు. "క్షమించండి" అని ఒక్కటే సమాధానం అందరికీను. నాలుగయిదేళ్ళు నిర్లిప్తంగా గడిచిపోయింది.

రెండు హిందీ చిత్రాల్లో నటించవలసి వచ్చింది. అవి కమర్షియల్ చిత్రాలు కావు. అందుకే నటించాను.

కథ ముగిసింది.

నేను నిన్న ఉదయం అర్జంటుగా విమానంలో మద్రాసు వెళ్ళాను. ఒక బెంగాలీ చిత్రంలో షూటింగ్ కార్యక్రమం వాయిదా వేసుకుని కాత్యాను చూసిరావడానికి.

చూశాను. తిరిగి వచ్చాను. ఇక వెళ్లనవసరం లేదు.

మరణం మనిషి జీవితానికి ముగింపు కాదు. బహుశా ఒక మజిలీ కావచ్చు. మరణం తరువాతనే మహానుభావులు ఎంతో గొప్పగా బ్రతుకుతున్నారు. వారు అమరులు. మరణం వారిని ఏమీ చెయ్యలేదు. కాత్యాను మరణం ఏం చెయ్యగలదు?

మరణించిన తీరు మనిషి జీవితాన్ని చెబుతుందంటారు. కొందరు ప్రమాదంలో అనాయాసంగా మరణిస్తారు. కొందరు మరణానికి జడవరు.. దాని వెంట వెళ్ళిపోతారు. వాళ్ళ పార్థివ వరారం మాత్రమే వెళుతుంది. వాళ్ళు ఇక్కడే ఉంటారు. కాత్యా ఇక్కడ లేదూ? మనలో లేదూ?

ఆమె చిత్రం అదే నావు "ఊర్వశి" ని తెచ్చిపెట్టిన చిత్రం పారిస్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎన్నికయింది. బహుశా ఆ వార్త చివరి ఘడియల్లో వినే ఉంటుంది. నావు కబురు తెలిసేసరికే వెళ్ళిపోయింది. తొందర పడి ఒక కోయిల మందే నిష్క్రమించింది. అయితే నన్ను చూడ్డానికి ఇంకా అలాగే ఉండిపోయింది. నా చేతుల్లోనే ఆమెను ఎలక్ట్రిక్ స్మశానానికి అప్పగించాను ఒక మేరకు స్వార్థం అవసరమే. కొంత స్థాయిలోనైనా రాజకీయం అవసరమే. ఈ పంచరంగుల పాడు ప్రపంచంలో బ్రతకడానికి కొద్దిపాటి అన్యాయం కూడా అవసరమూ. మచ్చలేని మనుషులు బ్రతకలేరు. ఇదీ సంగతి... ఇదీ నాకు కాత్యా చెప్పిన కథ.......

కాత్యా కాత్యా.... నీతో ఒక్కసారి ఒకే ఒక్కసారి మాట్లాడాలని ఉంది. కాత్యా నిన్ను నా గుండెలకి హత్తుకోవాలని ఉంది. నీ చేత మళ్ళీ మళ్ళీ అక్కా అక్కా అని పిలిపించుకోవాలని ఉంది. కాత్యా..... కాత్యా.....

*రచన : జనవరి, 1985*
*ప్రచురణ : ఆంధ్రప్రభ, ఆదివారం అనుబంధం,*
*17-3-1985, 24-3-1985*